WANTED REPORTERS
నవతరం తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం
తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్, రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 312 | గురువారం 19 -3-2026 | పేజీలు : 4 | వెల : 5-00

## మూసీపై.. వాడి వేడి చర్చ..



**పేదలకు అన్యాయం జరగనివ్వం: దుద్దిళ్ల**
**మూసీ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం ఇష్టంలేదా?: భట్టి**
**అంచనాలు పెంచారు: కేటీఆర్**

హైదరాబాద్, **నవతరం** మూసీ ప్రక్షాళన అంశం శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల మంటలు రేపింది. బుధవారం ఈ అంశంపై సభలో వాడీవేడి చర్చ జరిగింది. మూసీ ప్రక్షాళన, వ్యయం, పేదల పునరావాసం, ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నలు వేయగా.. నగరాభివృద్ధి కోసం ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైనదని ప్రభుత్వం పేర్కొంది. అయితే సర్కారు వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు చివరకు సభనుంచి వాకౌట్ చేశారు. తొలుత ఆ పార్టీ సభ్యుడు కేటీఆర్ చర్చలో పాల్గొని పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు వ్యయం రూ.లక్షన్నర కోట్లు అని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చెప్పారని, ఇప్పుడు రూ.ఆరేడు వేల కోట్లతో పూర్తవుతుందని చెబుతున్నారని, ఇందులో ఏది నిజమని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు సంబంధించి కనీసం డీపీఆర్ కూడా సిద్ధం కాకుండానే ఇళ్లను ఎలా కూలుస్తారని నిలదీశారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో చెప్పారని, ఇప్పుడు రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.



## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి

## రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్

- రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్
- మక్కలు మార్కెట్లోకి వచ్చిన కొనుగోళ్లు ఏవీ
- ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్రనష్టం
- గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- వెంటనే మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్






హైదరాబాద్,**నవతరం**
రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు.

## ఆదివాసీ ప్రాంతాల వనరులపై బీజేపీ కి ఉన్న శ్రద్ధ వారి అభివృద్ధిపై లేదు

- ఆదివాసీ హక్కుల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం విఫలం
- అణగారిన వర్గాల ఆత్మగౌరవం కాంగ్రెస్
- న్యూఢిల్లీ లోని ఇందిరా భవన్‌లో జరిగిన ఏఐసీసీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి సీతక్క



న్యూఢిల్లీ **నవతరం**
ఆదివాసీ ప్రాంతాల సహజ వనరులపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఆసక్తి, ఆ ప్రాంతాల ప్రజల అభివృద్ధిపై మాత్రం కనిపించడం లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఖనిజ సంపద, అటవీ వనరుల పై ఉన్న శ్రద్ధ అక్కడి ఆదివాసీలపై లేదని మండిపడ్డారు. గ్రామ స్వయం పాలనకు కీలకమైన గ్రామ సభలను, పెసా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభల అనుమతి లేకుండా అనేక ప్రాజెక్టులను అమలు చేయడం ద్వారా ఆదివాసీల హక్కులను హరిస్తోందని ఆమె ఆరోపించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు.
భారతదేశ ఆత్మగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో కాంగ్రెస్ చారిత్రాత్మకంగా ముందుంటుందని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, స్వాభిమానాన్ని కాపాడటం కోసం ఆందోళనకు కాంగ్రెస్ సిద్దమని స్పష్టం చేశారు.

# అధికారం పోయినా.. అహంకారం తగ్గలేదు

- కొత్త గవర్నర్‌కు ప్రతిపక్ష నేత శుభాకాంక్షలు చెబుతారనుకున్నా
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకూ వస్తారని అనుకున్నాం..
- ఆయన సభకే రాలేదు.. రూ.1.06 కోట్ల వేతనం తీసుకున్నారు
- సభ జరగనప్పుడొచ్చి సీఎం కుర్చీలో కూర్చుని ఆనందించండి
- వార్డ్ సభ్యుడైనా కాలేని హరీశ్.. వైఎస్ అండతో మంత్రయ్యారు
- బాబు కాళ్లు పట్టుకుంటేనే కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే అయ్యారు
- ప్రజల ఆశీర్వాదంతో వచ్చాను.. వారు నా కాలిగోటికి చాలరు
- కేసీఆర్ ఇచ్చింది చిప్ప.. రూ.8.11 లక్షల కోట్ల అప్పులు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్, **నవతరం**మార్చి 18 బీఆర్ఎస్ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారని, అధికారం పోయినా.. అహంకారం మాత్రం తగ్గలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఓడించి పక్కన కూర్చోబెట్టినా నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైజింగ్‌ను వెకిలి చేస్తున్నవారికి..
రావణాసురుడికి పట్టిన గతే పడుతుందన్నారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని తెలిపారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడానికి అవసరమైన విశిష్ఠ ప్రణాళిక అని పేర్కొన్నారు. గొప్ప సంకల్పాన్ని ప్రజల ముందుంచిన గవర్నర్‌కు సీఎం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత అనుభవాలను, రాష్ట్ర పరిస్థితులను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పాలసీ డాక్యుమెంట్‌ను ప్రజల ముందు పెట్టామని రేవంత్ తెలిపారు.

ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకూ ఇదే మంత్రి వర్గం అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, పరిశ్రమలు వస్తాయని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని రేవంత్ భరోసా ఇచ్చారు.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

- రాజ్యసభ ఓ ఓ పెన్ యూనివర్సిటీ
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు



న్యూఢిల్లీ, **నవతరం**
రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు.

సంపాదకీయం



# పరాభవనామ ఉగాది !

కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య–మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు.ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం.ఇది మార్గశిర– పుష్య–మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు.మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు.సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం– 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చించి.కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ష పక్షం ప్యాడ్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్ష అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్టాల్లో్ర కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళనాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్ ' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటేవంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శుభం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్ల పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు.

# పండగల పరమార్థం సేవ

## జాగ్రత్తలు తీసుకుంటూ నడవాలి

తిరుపతి,మార్చి18శ్రీ పరాభవ నామ సంవత్సరంలో వ్యక్తిగతంగానూ.. సామాజికంగానూ .. ఆలోచలను సక్రమంగా ఉంచే కాలమని పండితులు చెబుతున్నారు. మార్చి19న ప్రారంభమయ్యే పరాభవనామ సంవత్సరంలో ప్రతి విషయంలో స్పష్టత ఉండే అవకాశంఉంది. ఇంకా విద్యారంగంలో పెనుమార్పులకు అవకాశం.. సమాజ సేవ.. ఐకమత్యత మొదలగు విషయాల్లో గణనీయమైన ప్రభావం ఉంటుంది. ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాల కోసం దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పండితులు అంటున్నారు. ఏ పండుగ అయినా.. వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజ శ్రేయస్సు కూడా ముఖ్యం. ప్రతి రోజు సమాజ సేవ చేయడానికి ఎవరికి అవకాశం ఉండదు. అందువలన కొత్త సంవత్సరం రోజు శ్రీ పరాభవ నామ సంవత్సరంలో సేవా సంకల్పంతో ముందడుగు వేసి.. విద్య, వైద్యం, పునరావాస సేవలకు మన వంతు సహకారం అందించి. .వికలాంగులకు..అనాథ పిల్లలకు.. పేదవారికి చేయూత నిచ్చి . వెలుగు అనే ఆశను నింపుదాం. . .. అసలైన పుణ్యకార్యంలో భాగస్వాములయి.. . సమాజానికి మనవంతు సేవ చేద్దాం. ఈ ఏడాది దేశ భవిష్యత్? ఎలా ఉంటుంది.. ఏ పండితుని పంచాంగ శ్రవణం వినాలి.. అనే విషయాల గురించి చర్చించుకుంటున్నారు.. కొత్త సంవత్సరం పరాభవనామ సంవత్సరం.. ప్రపంచానికి సవాళ్ల సంకేతమా.. అవమానాలు.. అపజయాలు ఎలా ఉంటాయి.. అన్న సంశయాలు ఉన్నాయి. జ్యోతిషశాస్త్రం ప్రకారం తెలుగు కొత్త సంవత్సరం శ్రీపరాభవ నామ సంవత్సరంలో రాజకీయంగా సంచలనాలు.. పెనుమార్పులు జరిగే అవకాశం ఉందిం. పలు దేశాల్లో రాజకీయ సంక్షోభానికి దారితీసే పరిస్థితులు ఎక్కువుగా ఉన్నాయి. ఇక ఆర్థిక విషయాలను పరిశీలిస్తే అనేక విధాలుగా ఒడిదుడుకులు ఉండే అవకాశం ఉందని జ్యోతిష్య నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే రష్యా.. ఉక్రెయిన్? యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతుంది. ఇప్పుడు ఓ పక్క అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు.. ఇరాన్ తో తలపడుతుంది. అటు కొన్ని దేశాలు.. ఇటు కొన్ని దేశాలు ఇప్పటికే తమ మద్దతును ప్రకటించాయి. హార్మోజ్ జలసంధి నుంచి అమెరికా యుద్ధ నౌకలు వెళ్లేందుకు చైనా అభ్యంతరం తెలిపింది. ఇదే బాటలో మరికొన్ని దేశాలు కూడా ఉన్నాయి. అమెరికా ఏమాత్రం వెనక్కుతగ్గడం లేదు. అక్కడ పరిస్థితి అలా ఉంటే పాకిస్థాన్?.. ఆఫ్ఘనిస్తాన్ కూడా ఒకరిపై మరొకరు బాంబులు విసురుకుంటున్నారు. ఈ పరిణామాలు పరాభవనామ సంవత్సరంలో ఇంకా పెచ్చే మీరే అవకాశాలతో పాటు .. ప్రపంచంలో ఆర్థిక పరిస్థితిలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆటంకాలు, అవరోధాలు, సవాళ్లు, సమస్యలు, అవమానాలను సూచిస్తోంది. కొన్ని దేశాలకు అపజయాలు తప్పవంటున్నారు పండితులు. అంచనా వేస్తున్నారు. . వీటి ప్రభావం పాలకుల మీద, ప్రజల మీద తీవ్రస్థాయిలో ఉండబోతోందని చెబుతున్నారు జ్యోతిష్య పండితులు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉందని... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పరాభవ నామ సంవత్సరమనే పేరు ముఖ్య ఉద్దేశం అహంకారాన్ని వదిలిపెట్టి జ్ఞానంతో, వినయంతో లోపాలను సరిదిద్దుకుని అధిగమించడం, పురోగతి చెందడమే అయినా.. ప్రజలు.. పాలకులు..తీసుకొనే నిర్ణయాలతో ప్రతికూల పరిణామాలు జరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా కొత్త సంవత్సరంలో ఎవరికి వారు జాగ్రత్తగా ఉంటే విజయాలు, సాఫల్యాలను సాధించే అవకాశం కూడా ఉందని కూడా పండితులు చెబుతున్నారు.

# ఉగాది పచ్చడి వైశిష్ట్యం

కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం



శ్రీశైలం,మార్చి18తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు వసంత గమన శుభవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహౌషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్ధకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం– తీపి అనేది సంతోషానికి, ఉప్పు– జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు– చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు– పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు– కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు.ఉగాది పచ్చడి ఒక మహౌషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే వస్తాయి.. 'శతాయుర్వజ్ర దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ్' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్ట నష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోగలుగుతామని పండితులు చెబుతున్నారు.

## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు


టెహ్రాన్,మార్చి18 సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. (జ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

## లాంగ్ వీకెండ్‌లో ప్రైవేట్ బాదుడు

హైదరాబాద్,మార్చి18:సామాన్యుడికి సొంతూరి ప్రయాణం భారంగా మారుతోంది. వరుస సెలవులు రావడంతో నగరాల్లో నివసించే ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అదునుగా చేసుకుని ఛార్జీలను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి. మార్చి 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం కావడంతో మధ్యలో ఉన్న శుక్రవారం ఒక్క రోజు సెలవు పెడితే వరుసగా నాలుగు రోజులు పండుగను కుటుంబంతో గడపవచ్చని చాలామంది ప్రణాళికలు వేసుకున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని సంస్థలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సు ఛార్జీ సుమారు రూ. 1,500 నుంచి రూ. 2,000 మధ్య ఉంటుంది. కానీ ఈ లాంగ్ వీకెండ్ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ ధరలను ఏకంగా 3 నుంచి 4 రెట్లు పెంచేశాయి. నాన్ ఏసీ స్లీపర్ సీట్లకు కొన్ని ప్రముఖ ట్రావెల్స్ సంస్థలు ఒక వ్యక్తికి ఏకంగా రూ. 4,999 నుంచి రూ. 5,700 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సర్వీసుల్లో కూడా టికెట్ ధర రూ. 5,300 దాటిపోయింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే బస్సుల ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగాయి. పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు చేస్తున్నారు. పెంచిన ధరలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'విమాన ప్రయాణం కంటే బస్సు టికెట్ ధరలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాగైతే ఇంటికి వెళ్లడం కంటే నగరంలోనే ఉండిపోవడం మేలు' అని నెటిజన్లు వాపోతు న్నారు. సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగల సమయంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, అధిక ధరలు వసూలు చేసే ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుంటారు.

# అశ్వారావుపేటలో 'బూడిద' ముప్పు

- ఏ.యస్.ఆర్ కాలనీపై పగబట్టిన దుర్గా ఫ్లైయాష్ బ్రిక్స్
- అభివృద్ధి ముసుగులో సామాన్యుల ఆరోగ్యాన్ని తాకట్టు పెడుతున్న కార్పొరేట్ సంస్థలు
- అభివృద్ధి పేరిట అరాచకం, విషవాయువులు, బూడిద మేఘాలు
- కమిషనర్ గడప తొక్కిన కాలుష్య బాధ్యతలు
- తినే తిండిలోనూ బూడిదేనా? చిన్నపిల్లలు,వృద్ధుల ప్రాణాలతో చెలగాటం
- శ్వాస కోస వ్యాధుల భయం,మున్సిపల్ కమిషనర్ కు బాధితుల విన్నపం
- నిబంధనలు గాలికే.. అధికారుల మౌనం వెనుక మతలబు ఏమిటి?




నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి

అభివృద్ధి ముసుగులో అశ్వారావుపేట మున్సిపాలిటీలో పారిశ్రామిక విష సంస్కృతి రాజ్యమేలుతోంది. ఏ.యస్.ఆర్ కాలనీ ప్రజలు ఇప్పుడు ఊపిరి పీల్చుకోవాలంటేనే వణికిపోతున్నారు. స్థానికంగా ఉన్న దుర్గా ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీ వెదజల్లుతున్న బూడిద, ధూళి మేఘాలు వందలాది కుటుంబాల ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ దారుణంపై స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

**ఆహారంపై బూడిద పొరలు.. అరోగ్యంపై చావు దెబ్బ!**

దుర్గా ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీ నుంచి నిత్యం భారీగా వెలువడుతున్న బూడిద వల్ల ఏ.యస్.ఆర్ కాలనీలో పరిస్థితి భయానకంగా మారింది.

**విషతుల్యమవుతున్న భోజనం**

కాలనీలోని హోటళ్లు, గృహాల్లోని ఆహార పదార్థాలపై బూడిద పేరుకుపోతోంది. హోటల్ నుండి తెచ్చుకునే పదార్థాలలో కూడా ఈ విషపు బూడిద కలుస్తుండటంతో ప్రజల జీర్ణవ్యవస్థ దెబ్బతింటోంది.


**ప్రశ్నార్థకమైన పర్యావరణం**

ఇళ్ల పైకప్పులు, పెరట్లోని చెట్లు, రోడ్లు.. ఎక్కడ చూసినా బూడిద పొరలే కనిపిస్తున్నాయి. అశ్వారావుపేట నడిబొడ్డున ఇంతటి దుర్మార్గం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిల్లలు, వృద్ధుల ప్రాణాలు గాలిలో..





అశ్వారావుపేట,
తేది. : 14-3-2026.

శ్రీయుత గౌరవనీయులైన అశ్వారావుపేట మున్సిపల్ కమీషనర్ గారి దివ్య సముఖమునకు వ్రాసుకొను విన్నపము.

విషయం : ఎ.యస్.ఆర్ కాలనీ ముందువున్న దుర్గా ప్లయాస్ బ్రిక్స్ కంపెనీ ద్వారా వచ్చే కాలుష్యం గురించి.

అర్యా!

మేము అనగా ఎ.యస్.ఆర్. కాలని వాస్తవ్యులము అయ్యా మేము సుమారు 400 కుటుంబాల వారు నివాసం వుంటున్నాము. మాకు దగ్గరలోగల దుర్గాప్లయాష్ బ్రిక్స్ కంపెనీ నుండి వచ్చే బూడిదవలన మా ఆరోగ్యాలు పాడవుతున్నాయి. ఈ కంపెనీ ద్వారా వచ్చే బూడిద హోటల్స్‌లో తాయారయ్యే తినుబండారలమీద పడుటంద్వారా ప్రజలు హోటల్ నుండి తెచ్చుకొనే పదార్ధలలో బూడిద కలవటంవలన ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. మరియు ఎ.యస్.ఆర్.కాలనీలోవున్న ప్రజలకు దుమ్ము, దూళి వలన శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, రెస్పరేటరి, దగ్గు లాంటి వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లులు, వృద్ధులకు ఈ కాలుష్య ప్రభావం తీవ్రంగా వున్నది. ఇంట్టిచుట్టూవున్న పరిసరస ప్రాంతాలలో మరియు చెట్లపైన, ఇండ్లపైన బూడిద పేరుక్కొనటంవలన ప్రజలు తీవ్ర ఇంబ్బందులకు గురవుతున్నారు. గతంలో అశ్వారావుపేట గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికార్లు స్పందించలేదు.

కనుక ఇప్పుడైనా తమరు ఈ బ్రిక్స్ కంపెనీని మూసివేసి మా కాలని ప్రజలకు పైన వుదహరించిన శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, రెస్పరేటరి, దగ్గు లాంటివ్యాధులబారీనుండి కాపాడగలరని కోరుచున్నాము.

ఇట్లు
ఎ.యస్.ఆర్.కాలని నివాసులు
N. Srinivasa Rao
8341844222

ఈ కాలుష్యం కారణంగా కాలనీలోని సుమారు 400 కుటుంబాలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలు, వృద్ధులు కింది వ్యాధుల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు:

శ్వాసకోస వ్యాధులు: గాలిలోని ధూళి కణాల వల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి.

భయంకరమైన వ్యాధులు: వినతిపత్రంలో పేర్కొన్నట్లుగా స్థానికులు క్యాన్సర్, రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్లు, తీవ్రమైన దగ్గు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు.

**పంచాయితీ గడప తొక్కినా.. పట్టని వైనం**

గతంలో అశ్వారావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు కనికరించలేదని బాధితులు మండిపడుతున్నారు. వ్యవస్థల నిర్లక్ష్యం వల్లే ఈ ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీ యజమాన్యం బరితెగిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి.

"మా ప్రాణాలు పోతున్నాయని అరుస్తున్నా ఎవరూ వినడం లేదు. మా పిల్లల భవిష్యత్తు కోసమైనా ఈ కంపెనీని వెంటనే మూసివేయాలి."కాలనీ నివాసుల ఆవేదన.

**మున్సిపల్ కమిషనర్ స్పందిస్తారా?**

కాలనీ నివాసి ఎన్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమర్పించిన ఈ వినతిపత్రం ఇప్పుడు మున్సిపల్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సాగుతున్న ఈ వ్యాపార సామ్రాజ్యంపై కమిషనర్ కఠిన చర్యలు తీసుకుంటారా? లేక మునుపటి లాగే ఫైళ్లను పక్కన పడేస్తారా?

**నవతరం డిమాండ్:**

దుర్గా ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీని తక్షణమే నివాస ప్రాంతం నుండి తరలించాలి.


కాలుష్య నియంత్రణ మండలి ద్వారా పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టాలి.


బాధిత కాలనీ ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.


# కబ్జాదారులకు వరం 'జగద్గిరిగుట్ట'

- విడతలవారీగా దండుకుంటున్న కబ్జాదారులు
- మొదట ఫాస్ట్ ఫుడ్ ఏర్పాటు
- తర్వాత పర్మనెంట్ ఇంటి నిర్మాణం
- అంతా ఆలయ ఈవో కు తెలిసే జరుగుతుంది!
- అయిదువందల గజాలకు ఎసరుపెట్టిన కబ్జాకోరు
- కాపాడాల్సిన వారే కబళించేస్తున్నారు
- లాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోండి







జగద్గిరిగుట్ట / కుత్బుల్లాపూర్, నవతరం: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348/1 లోని ప్రభుత్వ భూములు రోజురోజుకూ అంతరించిపోతున్నాయి. ప్రధానంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూములు అందినకాడికి కబ్జా చేస్తూ లక్షల రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు ఇక్కడి కబ్జాదారులు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం జగద్గిరినగర్ నుండి సలాసర్ హనుమాన్ టెంపుల్ కి వెళ్ళేదారిలో ఎడమవైపు గల ఆలయ భూముల్లో గత మూడు సంవత్సరాల క్రితం కొందరు స్థానిక నాయకుల సహకారంతో గాయత్రి ఫాస్ట్ ఫుడ్ పేరుతో ఓ ఫాస్ట్ ఫుడ్ ఏర్పాటు చేసుకున్న కబ్జాదారుడు గత వారం రోజులుగా ఏకంగా చాటుమాటుగా పర్మనెంట్ నిర్మాణం చేపట్టి అందులో ఒక రూము నిర్మించి ఏకంగా ఆ పక్కనే ఉన్న సుమారు అయిదువందల గజాల ప్రభుత్వ భూమికి ఎసరుపెట్టాడు. దీని విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుంది. ప్రస్తుతానికి వంద గజాలు అనుకున్నా మొత్తంగా అయిదువందల గజాల స్థలాన్ని ఆక్రమించాలని స్కెచ్ వేసినట్టు విశ్వసనీయ సమాచారం. స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి సదరు ఆక్రమనకు తెరలేపినట్టు తెలుస్తుంది. అందుకు స్థానికంగా ఉన్న కొందరు నాయకులు, ఆలయకమిటీ సహకరిస్తున్నట్టు సమాచారం. ఇదే కబ్జాదారుడు గతంలో సలాసర్ హనుమాన్ టెంపుల్ కు ఎదురుగా.. వేదపాఠశాల ముందు కొంతభాగం ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమ్మి సొమ్ము చేసుకున్నట్టు అదనపు సమాచారం. సదరు కబ్జాదారులను ఇలాగే వదిలేస్తే ఇంకా ఎన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందో.. తక్షణమే ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించి, బాధ్యులపై లాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## విగ్రహావిష్కరణలో పాల్గొన్న పుప్పాల భాస్కర్



కుత్బుల్లాపూర్, నవతరం: సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప తెలుగు తల్లి నగర్ లో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన, కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిహెచ్ఎంసి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, ప్రముఖ నాయకులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం కమిటీ సభ్యులు నిర్వహించిన ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి ఉత్సాహంగా వేడుకలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పసుల కృష్ణ, శేఖర్, స్వరూప రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పసుల లక్ష్మి, బాలకృష్ణ, రామకృష్ణ, లక్ష్మణ్, డేవిడ్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మదనపల్లి ఫైల్స్ దహనం కేసు

### పెద్ది రామంద్రారెడ్డి పిఎ, అనుచరుడి అరెస్ట్

తిరుపతి,మార్చి18 తిరుపతి జిల్లా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించిన ముని తుకారాం, ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. నాయకులతో కలిసి కాఫీ తాగేందుకు వచ్చిన ఇరువురిని చంద్రగిరి మండలం పనపాకం టోల్ ఎ÷-లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తిరుపతిలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024 జులై 21న ÷ల్స్ తగులబెట్టారు. ఈ కేసులో ఏ3గా మాధవరెడ్డి, ఏ4గా ముని తుకారాం ఉన్నారు. ఈ ఇద్దరు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఇటీవల వారికి అక్కడ చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు బుధవారం వారిని అరెస్ట్ చేశారు.

## ఎస్ఐ భార్య ఆత్మహత్య

కరీంనగర్,మార్చి18 :కరీనంగర్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. విషపూరితమైన గన్నేరు పప్పు తినడంతో తీవ్ర అస్వస్థతకు గురైన దివ్యను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, చంద్రశేఖర్, దివ్య దంపతులకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. దివ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## తండ్రీ కూతుళ్లను హత్య చేసిన అల్లుడు

### ఆపై పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగుడు

హన్మకొండ,మార్చి18హనుమకొండ జిల్లాలో ఘోరం జరిగింది. అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవదహనమై కనిపించారు. కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మృతులను రాజశేఖర్ (54), రాజశ్రీ (24)గా గుర్తించారు. కాగా, రాజశ్రీకి 2023లో ప్రవీణ్ అనే యువకుడితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు కూడా ఉన్నారు. అయితే కుటుంబ కలహాల కారణంగా ప్రవీణ్.. వారిద్దరి ఒంటిపై డీజిల్ పోసి నిప్పు పెట్టినట్లుగా అనుమానిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు.

## అక్కను హత్య చేసిన తమ్ముడు

హైదరాబాద్,మార్చి18 :రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో దారుణం చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో ఆమెను తమ్ముడు హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు. కొన్నాళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును తమ్ముడు పప్పు రామ్ గమనించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా.. వినిపించుకోకపోవడంతో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పూర్ చెరువులో పడేశాడు. గత నెల 28న ఆమె బాటసింగారంలోని కిరాణ దుకాణానికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో తమ్ముడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య వ్యవహారం బయటపడింది.

## ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి

న్యూఢిల్లీ,మార్చి18: ఢిల్లీలోని పాలెంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భవనం బేస్మెంట్, గ్రౌండ్ఎ÷-లోర్‌లో బట్టల దుకాణంతో పాటు కాస్మెటిక్స్ షోరూం కూడా ఉన్నది.

# 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

## రూ. 600ల కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

## ఎత్తులకు పై ఎత్తులతో ఆక్రమణలకు దిగిన కబ్జాదారులు

హైదరాబాద్, నవతరం: నగరం నడిబొడ్డున ఖైరతాబాద్ మండలం వెంగళరావునగర్లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో దీని విలువ రూ. 600ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా.. 1975 కంటే ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం ఇచ్చి 45 ఎకరాల భూమని హౌసింగ్ బోర్డు సేకరించింది. మొత్తం 660 ప్లాట్లతో లే ఔట్ వేసింది. ఇందులో పార్కులకోసం కొన్ని స్థలాలను కేటాయించింది. వెంగళరావునగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ప్రజావసరాలకోసం 5 ఎకరాల స్థలాన్ని ఖాళీగా ఉంచింది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాల వరకూ ఆక్రమణలు జరిగి శాశ్వత కట్టడాలు వచ్చాయి. వాటి జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. హౌసింగ్ బోర్డు నుంచి గతంలో పరిహారం తీసుకున్నవారితో పాటు మరో 3 గ్రూపులు ఈ భూమి తమదిగా చెబుతూ ఆక్రమణలకు పాల్పడిన వారితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసింది. ఎవరి వద్దా సరైన పత్రాలు లేవని నిర్ధారించింది. ఇదే సమయంలో ఆ ఖాళీ స్థలం తమదిగా పేర్కొంటున్న వారు హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ విషయంలో హైకోర్టు స్టే ఇచ్చింది. స్టే కొనసాగుతున్నప్పుడు అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదనే నిబంధనలు పట్టించుకోకుండా.. అందులో కొత్తగా షెడ్డులు వేయడం, గుడిసెలు నిర్మించడం, వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ రావడంపై స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. మీడియాలో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణలకు సంబంధించిన కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా బుధవారం ఆక్రమణలను తొలగించింది. 3 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.









### కబ్జాదారుల కథలెన్నో

రహ్మతుల్లా నుంచి 45 ఎకరాల భూమిని కొని హౌసింగ్ బోర్డు లే ఔట్ వేపింది. ఈ లే ఔట్లో 5 ఎకరాల భూమని ప్రజావసరాలకోసం ఖాళీగా ఉంచింది. హౌసింగ్ బోర్డు వారు లే ఔట్ వేసినప్పటికే గుడెసెలు ఉన్న 2ఎకరాల భూమిని అక్కడ ఉన్న వారికి ఇచ్చేయాలని సుప్రింకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారికి కేటాయించడం జరిగింది. ఇంకా మిగిలి ఉన్న 3 ఎకరాల భూమి చుట్టూ కబ్జాల కథ నడుస్తోంది. సుప్రిం కోర్టు ఆదేశాలమేరకు గుడిసెల వారు సొంతం చేసుకున్న 2 ఎకరాల భూమిని అక్కడ నివాసితుల ప్రతినిధిగా జీపీఏ తీసుకుని రామస్వామి అమ్మేశాడు. అక్కడికే పరిమితమ్వకుండా.. ఆ పక్కనే మిగిలిన 3 ఎకరాల భూమిపై కూడా రామస్వామి.. అతని వారసుల కన్ను పడింది. రామస్వామితో పాటు ఆయన వారసుల ప్రయత్నాలు ఇలా ఉంటే.. ఈ భూమిని తమకు జాగీర్దార్ లక్ష్మణరావు అమ్మారంటూ డేవిడ్ రాజు, దేవసహాయం (అన్నదమ్ములు) తప్పుడు పత్రాలతో తమదిగా చెబుతూ వస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా జాగీర్దార్ లక్ష్మణరావుకు చెందినదిగా లేదు. హౌసింగ్ బోర్డుకు గతంలో అమ్మిన రహ్మతుల్లా వారసులు తమకు అమ్మారని.. మహారాష్ట్రలోని లాథూర్లో ఉన్న వారి వద్ద జీపీఏ కుదుర్చు కున్నామని ఆర్కేవీ సంస్థకు చెందిన ప్రతినిధులు గోపీనాథ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు చెబుతున్నారు. ఇదే వారసులు తమకు అమ్మారని కె. రాజేష్ అనే వ్యక్తి చెబుతూ వస్తున్నారు. వీరందరి వెనుకా వివిధ పార్టీలకు చెందిన రాజకీయనా యకులున్నారనే వార్తలు వెల్లడౌతున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ భూమి తమదిగా పేర్కొంటున్న వారందరితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసింది. వారి వద్ద ఉన్న పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఎవరూ సరైన పత్రాలు చూపించలేకపోయారు. ఎవరికి వారు హైకోర్టుకు గతంలో వెళ్లగా.. స్టే ఇచ్చిన విషయాన్ని పట్టించుకోకుండా అక్కడ కొత్తగా గుడిసెలు వేయడం, పలు షెడ్డులు నిర్మించడంతో పాటు.. వ్యాపారాలకు అడ్డాగా మార్చుకున్నారు. దీంతో హైడ్రా రంగంలోకి దిగి బుధవారం ఆక్రమణలు తొలగించింది.

# అన్నదాతల సొమ్ము.. అధికారుల పాలు

**● అశ్వారావుపేట 'సహకార' కుంభకోణం రూ. 61 లక్షల గోల్‌మాల్.. నిమ్మకు నీరెత్తిన అధికారులు**

**● ధాన్యం కొనుగోళ్లు, సబ్సిడీ,లోన్ల మంజూరులో భారీ దోపిడీ.. విచారణలో నిజం తేలినా రికవరీ సున్నా**

**● సీఈఓల సస్పెన్షన్‌తో సరి.. క్రిమినల్ కేసులు ఏవి? రైతుల సాగు కష్టాలకు జవాబుదారీ ఎవరు?**

**● సస్పెన్షన్ల వేటు.. రికవరీకి మాత్రం కోత**

**● రైతు రాజ్యంలో పేదవాడి పైనే సహకార కత్తి, దోచుకున్న వారు బయట.. దాచుకున్న వాడు ఆగమైతాడు**

**● అధికారుల ఉదాసీనతపై ఏసీబీ న్యాయపోరాటానికి సిద్ధం**


నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి

రైతుకు అండగా ఉండాల్సిన అశ్వారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవినీతికి నిలయంగా మారింది. చెమటోడ్చి పండించిన అన్నదాతల నోరు కొట్టి, అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వైనం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలకలం రేపుతోంది. ఏడాది క్రితమే సుమారు రూ. 61 లక్షల మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు సాక్షాత్తూ ఉన్నతాధికారుల విచారణలో తేలినా, నేటికీ నయాపైసా రికవరీ కాకపోవడం గమనార్హం.

### అసలేం జరిగింది? నివేదిక ఏం చెబుతోంది?

ఏడాది క్రితం సొసైటీ డైరెక్టర్ బత్తినీ పార్థసారధి చేసిన ఫిర్యాదుతో ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు, రైతులకు అందాల్సిన సబ్సిడీల మళ్లింపు, లోన్ల మంజూరు మొత్తాలను పక్కదారి పట్టించడం వంటి అంశాలపై జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి లోతైన విచారణ జరిపారు.

నిర్ధారణ అయిన మొత్తం: ?61,00,000 (అక్షరాలా అరవై ఒక్క లక్షల రూపాయలు). దొరికిన దొంగలు: విచారణలో అక్రమాలు రుజువు కావడంతో అప్పటి సీఈఓ మరియు ఇన్చార్జ్ సీఈఓలపై వేటు పడింది.




వీరిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### సస్పెన్షన్ శిక్షా? లేక రక్షా?

అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, కేవలం సస్పెన్షన్‌తోనే సరిపెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### క్రిమినల్ కేసులు లేవు:

ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం పక్కదారి పడినా, బాధ్యులపై ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడం వెనుక ఉన్న మర్మమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రికవరీ ఊసే లేదు: స్వాహా చేసిన రూ. 61 లక్షలను రికవరీ చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సస్పెండ్ అయిన అధికారులు యధేచ్ఛగా బయట తిరుగుతుంటే, నిధుల రికవరీ ఎప్పుడు జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

అన్నదాతల 'సాగు' కష్టాలు.. పట్టించుకోని పాలకుల తీరు వానకాలం సాగు సీజన్ ముంచుకొస్తోంది. పొలాల్లో విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతుంటే, వారికి ఎరువులు, విత్తనాలు అందించే దిక్కు లేకుండా పోయింది నామమాత్రపు ఇన్చార్జి: డీసీసీబీ సూపర్‌వైజర్‌ను ఇన్చార్జిగా నియమించినప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

వడ్డీ కడదామన్నా అడిగే వారు లేరు: తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి, కొత్త రుణాలు పొందదామంటే సొసైటీలో స్పందించే నాథుడే కరువయ్యారు.






నిలిచిన సబ్సిడీలు: అర్హులైన రైతులకు అందాల్సిన సబ్సిడీ సొమ్ము అధికారులు, సిబ్బంది జేబుల్లోకి వెళ్లడంతో సామాన్య రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

ఏసీబీ కోర్టును ఆశ్రయించే యోచనలో రైతులు

అవినీతి తిమింగలాలను అధికారులు కాపాడుతున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. జిల్లా అధికారుల తీరుపై నమ్మకం సడలిన రైతులు, ఇప్పుడు న్యాయం కోసం ఏసీబీ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించు కున్నారు. వ్యవస్థలో వేళ్లూనుకున్న అవినీతిని అంతం చేసేందుకు న్యాయపోరాటమే శరణ్యమని రైతులు భావిస్తున్నారు.నవతరం డిమాండ్ వెంటనే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అపహరణకు గురైన రూ. 61 లక్షలను వడ్డీతో సహా రికవరీ చేసి, వెంటనే రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలి. ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే అన్నదాతల ఆగ్రహానికి గురికాక తప్పదు.

# కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

**సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకోవడం ఆనవాయితీ**

యాదగిరిగుట్ట,మార్చి18 ఉగాది పండుగ తెలుగు వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపే పండగు. సంస్కృతి.. సంప్రదాయాలకు.. ధర్మబద్ధ జీవన విధానాన్ని ప్రారంభించిన రోజు. ఇలాంటి ముఖ్యమైన రోజున మన జీవితాలను ఆధ్యాత్మిక పరంగా.. సేవా పరంగా ఎన్నో కార్యక్రమాలు చేయాలని పండితులు చెబుతున్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి తిథి ఉదయం 6.53 గంగలకు ప్రారంభమవుతుంది. పాడ్యమి తిథి మార్చి 20 ఉదయం 04:54 గంటలకు ముగుస్తుంది. కావున పండితులు తెలిసిన వివరాల ప్రకారం ఉదయం సమయంలో పాడ్యమి తిథి ప్రాబల్యం ఉండటం వల్ల మార్చి 19నే ఉగాది పర్వదినంగా భావిస్తారు.ఉగాది రోజున ప్రాత: కాలంలో కాలకృత్యాలు తీర్చుకొని ఇంటిని శుభ్రం చేసుకోవాలి. తరువాత ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి.. గడపలను పసుపు.. కుంకుమతో అలంకరించాలి. పూజా మందిరంలో కలశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబంలో కలశాన్ని ఏర్పాటు చేసుకొనే ఆచారం లేకపోతే అవసరం లేదు. కుల దైవాన్ని ఆవాహన చేసుకోవాలి. ముందుగా కొత్త సంవత్సరానికి సంబంధించిన సంకల్పాన్ని చెప్పుకొని.. గణపతి పూజ చేసుకొని.. విష్ణుమూర్తిని.. లక్ష్మీదేవిని.. పరమేశ్వరునికి పూజలు చేయాలి. షోడసోపచార పూజలు చేసి.. ధూపం.. దీపం.. హారతి తరువాత ఉగాది పచ్చడిని స్వామివారికి నివేదించి ప్రసాదంగా తీసుకోవాలి. ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించడం ద్వారా జీవన తత్వాన్ని గుర్తుచేసుకుంటారు.తరువాత మహానివేద్యం సమర్పించాలి. ఈ విధంగా చేయడం ఎంతో కాలంగా వస్తున్న ఆచారం.. ఇంట్లో పూజ అనంతరం... దగ్గరలోని దేవాలయానికి వెళ్లాలి. ఉగాది రోజున పంచాంగ శ్రవణం వినాలి. ఇది ఒక ప్రాచీన ఆచారమని పండితులు చెబుతున్నారు. పంచాంగం అనేది తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం వంటి 5 ముఖ్య అంశాలను వివరిస్తుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఖగోళ మార్పులు .. వాటి ప్రభావాలను తెలియజేస్తాయి. పంచాంగ శ్రవణం ద్వారా ఆ సంవత్సరంలో వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ స్థితిగతులు, సామాజిక శాంతి వంటి అంశాలపై సంక్షిప్త అవగాహన లభిస్తుంది. తరువాత బ్రాహ్మణులకు వస్త్రదానం .. దక్షిణ తాంబూలం ఇచ్చి.. వారి ఆశీర్వాదాలను తీసుకోవాలి. తెలుగు పంచాంగం ప్రకారం మొత్తం 60 సంవత్సరాలు ఉంటాయి. ఇవే పునరావృతమవుతుంటాయి. ఈ ఏడాది 2026 లో మార్చి 19న కొత్త తెలుగు సంవత్సరం పరాభవనామ సంవత్సరం ప్రారంభమవతుంది. పరాభవం అంటే లోపాలను అధిగమించి ఉన్నత స్థితిని చేరుకొనే సమయాన్ని సూచిస్తుందని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో ఆధ్యాత్మికత.. వినయం.. ఆత్మపరిశీలన.. సేవాగుణాన్ని వృద్ధి చేసే సందేశాన్ని ఇస్తుంది.

# ఉగాది రోజు ఆలయదర్శనం శుభం

వేములవాడ,మార్చి18:తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మార్చి 19వ తేదీ గురువారం ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ రోజు ఏం చేస్తే.. ఏడాదంతా అదే జరుగుతుందనే ఒక భావన తెలుగు ప్రజలలో బలంగా ఉంది. గతేడాది కొంత కష్టంగా ఉంది. ఈ ఏడాది అయినా బాగుంటుందా అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అలాంటి వారు ఉగాది పర్వదినం వేళ.. ఇలా చేయడం వల్ల ఏడాదంతా శుభ ఫలితాలు పొందవచ్చని పండితులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కష్టాలు తొలగి.. ఆనందంగా ఉండొచ్చని అంటున్నారు. కొత్త ఏడాది ఎలా ఉండబోతోంది.. గ్రహాల ప్రభావం ఏ రాశుల మీద ఎలా ఉందనేది పండితుల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పండగ రోజు.. దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటే కుటుంబానికి శుభం కలుగుతుందని పండితులు చెబుతారు.

ఆ రోజు పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, విజయాలు కలుగుతాయి. ఉగాది వేళ.. మీకు తోచిన వాటిని దానం చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుంది. అన్నదానం, వస్త్రదానం ఇలా ఏదైనా చేయవచ్చు. ఉగాది రోజు కొత్త పనులు ప్రారంభిస్తే మంచి ఫలితాలు సంప్రాప్తిస్తాయి. చేపట్టిన పనుల్లో అడ్డంకులు ఉండవు. కొత్త ఏడాది మంచి ఆలోచనలతో ప్రారంభించాలి. ఉగాది నుంచి ఈ ఏడాది అంతా బాగా కలిసి రావాలని మనస్సులో సంకల్పం చెప్పుకొని.. కొత్త పనులు ప్రారంభించాలి. ఉగాది రోజు గణపతి ఆలయానికి వెళ్లి గరికను సమర్పిస్తే శుభం కలుగుతుంది. ఎర్రటి పుష్పాలను సమర్పిస్తే.. శుభ ఫలితాలు కలుగుతాయి. వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు. ఈ రోజు ఓం గం గణపతయే నమ: అంటూ సాధ్యమైనన్ని సార్లు ఈ మంత్రాన్ని స్మరణ చేసుకోవాలి. ఉగాది రోజు ఇలా చేయడం వల్ల ఏడాదంతా ఐశ్వర్యం, ఆనందం, శుభాలు కలుగుతాయి.

# కేంద్రమంత్రి గడ్కరీతో రాహుల్, ప్రియాంకల భేటీ

న్యూఢిల్లీ,మార్చి18 కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా బుధవారంనాడు పార్లమెంటు హౌస్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలుసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి ముందు, స్మాల్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రతినిధి బృందం సభ్యులు రాహుల్ గాంధీ కలుసుకున్నారు. ఇందువల్ల తామ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని వివరించారు.గడ్కరితో సమావేశానంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ, లైసెన్స్ పక్రియ ఖరీదైన వ్యవహారంగా మారడం, కాలహరణం జరుగుతుండటం వంటివి చోటుచేసుకుంటున్నాయని, ఈ విషయాన్ని గడ్కరి దృష్టికి తెచ్చామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని గడ్కరి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

# పాన్‌తో ఆధార్ లింక్

న్యూఢిల్లీ,మార్చి18 కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. అయితే రాబోయే ఆర్థిక సంవత్సరం నుంచి అలా కుదరదు. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి 31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com